క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ట్యాబ్‌ల పంపిణీ..
తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ బుధవారం చేపట్టనున్నట్లు ఎంఈవో త్రినాధరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్బాపు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి రూ.10 వేలు అందిస్తున్న సర్పంచ్ వెంకటినాయుడు

రేగిడి: మండలంలోని ఏవీపురం గ్రామంలో పోరాపు పార్వతికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేల వైఎస్సార్ బీమా తక్షణ సాయం మంగళవారం అందజేశారు. ఆమె భర్త పోరాపు గౌరునాయుడు ఇటీవల మృతి చెందగా, నామినీ అయిన పార్వతికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం అందించగా, మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తారు. కార్యక్రమంలో గోగుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణం

రాజాం: మండలంలోని మెంతిపేట గ్రామం వద్ద ఉమామృత్యుంజయ ఆలయ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రూ.50 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇటు మెంతిపేట, అమ్మవారి కాలనీలతో పాటు అటు రాజాం పట్టణానికి అందుబాటులో ఉండేలా ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

బొబ్బిలి: స్థానిక జెండా మహల్ వద్ద సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ తొలుత జెండాను ఆవిష్కరించి, పార్టీ లక్ష్యాలు, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో వై.బాబ్జీ, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ హోమం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఉన్న షిర్డీసాయి మందిరంలో గ్రామస్తులు దత్తాత్రేయ హోమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు బంకపల్లి సత్యనారాయణ శర్మ, సంతోష్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో ఈ హోమం చేపట్టారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



కోర్టు ఆవరణలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

రాజాం సిటీ: భూ హక్కు చట్టం రద్దు చేయాలని కోరుతూ స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, భూ హక్కు చట్టం రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత తలే రాజేష్, సమతా సైనిక్ దళ్ ఇన్‌చార్జ్ టి.మోహన్, సర్పంచ్ వి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: మండల కేంద్రంలోని జీసీఎస్ఆర్ కళాశాల మైదానంలో సర్వీసు చేసి, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి: గొల్లపల్లిలో కబడ్డీ కూతకు వెళ్లి, పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ఆరంభం..అదిరింది!

ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట క్రీడాపోటీలను మంగళవారం లాంఛనంగా ప్రారంభించింది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు పోటీలను ఆరంభించి, క్రీడాకారులను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ఆడి, గెలవాలన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉజ్వల భవిష్యత్ పొందారని, వారిని ఆదర్శంగా తీసుకుని, ముందుకు సాగాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహనరావు



వంగర: ఎం.సీతారాంపురంలో ఆడుదాం ఆంధ్రా పోటీల ప్రారంభోత్సవంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, తదితరులు



తెర్లాం: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



సంతకవిటి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఆడి, పోటీలు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ జగన్మోహనరావు



బాడంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బ్యాటింగ్ చేసి, క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మెంటాడ: పోరాం గ్రామంలో క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సన్యాసప్పలనాయుడు



రాజాం: పొగిరిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాజ్యోతి వెలిగించి, ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



తెర్లాం: మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల సామగ్రి అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపీడీవో రామకృష్ణ



రామభద్రపురం: ఆరికతోటలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు

'ఆడుదాం ఆంధ్రా'తో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడాపోటీలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, అందరూ క్రీడాపోటీల్లో పాల్గొని, క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. వ్యాధుల నివారణకు ఉత్తమ మార్గాల్లో ఒకటి వ్యాయామం కాగా, మరొకటి క్రీడల్లో పాల్గొనడమన్నారు. మహిళలు, బాలికల్లో సైతం క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహిస్తోందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా జగనన్న సర్కారు చేపడుతున్న ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలని, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా వెలుగొందాలని ఎమ్మెల్యే కోరారు. ఏటా డిసెంబరులో ఈ పోటీలు జరుగుతాయన్నారు. రూ.12 కోట్ల విలువైన నగదు బహుమతులను క్రీడాకారులకు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్, రూరల్, వంగర మండల అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరు పరిశీలన

రాజాం: మండలంలోని గురవాంలో గ్రామ మహిళా సంఘాల పనితీరుపై వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ ఎ.చిరంజీవి మంగళవారం సమీక్షించారు. మోనటరింగ్ మెకానిజంలో భాగంగా క్షేత్ర సందర్శన చేసి, సంఘం పనితీరు పరిశీలించినట్లు ఏసీ తెలిపారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో జిల్లా పీడీ కల్యాణ చక్రవర్తి ఆదేశాలతో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామ సంఘం పుస్తకాలు తనిఖీతో పాటు, అప్పులు ఇవ్వడం, రుణాల వసూళ్లు, పొదుపు, వైఎస్సార్ ఆసరా లబ్ధి, వైఎస్సార్ సున్నా వడ్డీ, స్త్రీ నిధి అప్పులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, ఎఫ్‌పీఓ ఏపీఎం దధికుమార్ పాల్గొన్నారు.

దత్త జ్ఞానబోధ సభ

రేగిడి: స్థానిక దత్తపీఠంలో దత్త జ్ఞానబోధ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు, దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం, సోదరసోదరీమణుల బంధాలు భారతీయ సాంస్కృతిక వైభవమని తెలిపారు. సమాజానికి ఆదర్శవంతంగా జీవనం సాగించాలన్నారు. గురువును దైవ సమానులుగా భావించి, గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్తలు జడ్డు జగ్గారావు, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

వస్త్రదానం

రామభద్రపురం: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మండలంలోని ఆరికతోట ఏడీఎంఎం చర్చిలో వైస్ ఎంపీపీ పెంకి భీమయ్య మంగళవారం వస్త్రదానం చేశారు. ఆయన తన సొంత నిధులతో సమకూర్చిన చీరలు, పంచెలు, దుప్పట్లను దాదాపు 600 మందికి పంచిపెట్టారు. దీంతో పాటు క్రిస్మస్ సంబరాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెంకి శేఖర్, పెంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' మేట్లకు శిక్షణ



రాజాం: ఉపాధి హామీ పథకం మేట్‌ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజగోపాలనాయుడు

సంతకవిటి: మండలంలోని పరిశిలో ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మేట్‌లకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎన్ఐసీ సర్వర్‌లోని విధివిధానాలకు తగినట్లుగా కొలతలు, మస్తర్లు, మార్క్ అవుట్స్‌పై మేట్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి 8 గ్రామపంచాయతీల నుంచి 85 మంది మేట్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఎం.శ్రీనివాసరావు, కోర్స్ డైరెక్టర్ చిన్నిరావు, ఏపీవో హరినాథరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: ఉపాధి హామీ పథకం పనులు చేయిస్తున్న మేట్‌లు బాధ్యతగా పనిచేయాలని ఏపీవో ఎస్.హరనాధరావు సూచించారు. మండలంలోని చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, నాయిరాలవలస, బూరాడ తదితర గ్రామాలకు చెందిన మేట్‌లకు స్థానిక ఎస్ఆర్ ఈజీఎస్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. జాబ్‌కార్డులో ఉన్న ప్రతీ వేతనదారునికి పనులు కల్పించడంతో పాటు కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. రోజుకు రూ.272 దాటి వేతనం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, టీఏలు సత్తిరాజు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలో ఖరీఫ్ పనులు ముగియగానే ఉపాధి హామీ పథకం పనులు అన్ని గ్రామాల్లో ప్రారంభించి, వలసలు లేకుండా చూడాలని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు ఉపాధి హామీ పథకం మేట్‌లకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మేట్‌ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు జరిగేలా చూడాలని, వేతనదారులు పనుల కోసం ఇబ్బంది పడే పరిస్థితి ఉండకూడదన్నారు. ఎస్ఆర్ఈజీఎస్ ఏపీడీ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ముందుగా గుర్తించిన ఉపాధి హామీ పనులు చేయాలని, వేతనదారులకు రోజుకు రూ.272 దాటి వేతనం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు, మేట్‌ల ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ రఘు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

రాజాం సిటీ: మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించనున్నామని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని పెనుబాక గ్రామంలో కొత్తగా పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలను ప్రభుత్వం అందించడం జరుగుతోందన్నారు. అర్హులైన వారందరికీ జనవరి నుంచి పింఛన్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని కోడూరు, డొంకినవలస గ్రామాల్లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను మండల పరిపాలనాధికారి రామలింగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. గొల్లాది, గజరాయునివలస, తెంటువలస, వీరసాగరం, బాడంగి–2 గ్రామాల్లో కొత్తగా 92 మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత వివరించి, ఘన, ద్రవ, జీవామృతాల తయారీ, వాటి వినియోగం, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటలు సమాజానికి అందించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడు, ఐసీఆర్పీలు పుర్లి లక్షుంనాయుడు, కరణం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సోమరాజుపేటలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఏవో మురళీకృష్ణ

భూముల రీసర్వేతో రైతులకు మేలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేతో రైతులకు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో భూముల రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించి, హక్కుదారులకు భూహక్కుపత్రాలు(పట్టాదారు పాస్‌పుస్తకాలు) మంగళవారం ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందేళ్ల తర్వాత జరిగే ఈ సర్వేతో రైతుల భూమి కచ్చితమైన వివరాలతో తెలియరావడమే కాకుండా ఎన్నోఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. సర్వేలో లోపాలు ఉంటే అధికారుల ద్వారా వాటిని పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీవో పి.రవికుమార్, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, వైఎస్సార్ సీపీ నేతలు శంబంగి వేణుగోపాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పక్కి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



ఎంపీపీకి పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలుపుతున్న ఏక్‌నాథ్

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన పత్తిగుళ్ల ఏక్‌నాథ్ మంగళవారం ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎంపీపీకి పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతీ గడపకు సంక్షేమం అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి కొనసాగిస్తూనే మరోవైపు సంక్షేమాన్ని నిరంతరాయంగా సాగిస్తున్నారన్నారు. కోవిడ్ విపత్తు సమయంలోనూ సంక్షేమ పథకాలు అందివ్వడం ఆగలేదని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలు అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. సచివాలయాలతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల దగ్గరకే పథకాలు వస్తున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, ఎంపీడీవో పి.రవికుమార్, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

- సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల ద్వారా చేపడుతున్న ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీవో లక్ష్మణరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి, అన్ని ఏర్పాట్లు చేయాలని తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యాధికారులకు తెలియజేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా మేట్లకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సంబంధించి, బిల్లులు సకాలంలో జరిగేలా చూడాలన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి రాజశేఖరరావుకు చెప్పారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు చర్యలు చేపట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు.

పరామర్శ



సంతకవిటి: గణపతిరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామినాయుడు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, సర్పంచ్ పప్పల గణపతిరావును జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు మంగళవారం కలిసి పరామర్శించారు. గణపతిరావు మాతృమూర్తి అమ్మాయమ్మ ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఆయా నేతలు బాధిత కుటుంబాన్ని కలిసి, ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జి.ఎస్.పురం సర్పంచ్ పి.ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు వై.శ్రీనివాసరావు, వి.బాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.